# 2. అల్లుడి అవస్థ

"ఏమిట్రా ఆ ఉత్తరం?" అన్నాడు ప్రభాకరం.

"అత్తవారింటినుంచి సంక్రాంతి పిలుపు" అన్నా నవ్వుతూ.

"ఛాన్సు కొట్టావన్నమాట?"

"ఇంతకూ వెళ్ళమంటావా?"

"తప్పకుండా వెళ్లాలి. నువ్వు అత్త వారి ఇంటికి వెళ్ళటం, ఇదే మొదటిసారి కాబోలు–"

"ఊఁ"

"వెళ్లటం మంచిదే - కాని, బహు మెలకువతో ప్రవర్తించాలి."

"ఆ మెలకువ ఏమిటో కొంచెం విశదీకరించు ప్రభూ! కొత్తవాడిని, గోతిలో పడనీవోక."

"అల్లా అడుగు. నా సలహాప్రకారం నడుస్తే నువ్వు గోతిలో పడటం కూడానా?"

"అందుకనే అడుగుతున్నాగా–"

ప్రభాకరం ఒక్కసారి సకిలించి, సిగరెట్టు ముట్టించి చెప్పటం మొదలుపెట్టాడు.

"నులక మంచానికి బిగువు తగ్గుతే, కుక్కి అవుతుంది– తెలుసా?"

"ఆ తెలుసు."

"అల్లాగే, అల్లుడికి బెట్టు తగ్గితే, లోకువ అవుతాడు."

"ఊఁ"

"కాబట్టి ఆ బెట్టు తగ్గనీయకూడదు."

"అదే ఎల్లాగో చెప్పవయ్యా!"

"చెప్తా విను. నిన్నసలు బయలుదేరి రమ్మని వుత్తరం రాస్తే, నువ్వు, నాకిప్పుడు తీరికలేదు. గ్రూప్‌లో పొయ్యేట్టుగా వుంది. కాబట్టి కష్టపడి చదువుతున్నాను. ఈసారికి రాలేను - క్షమించాలి, యీ ధోరణిలో జవాబు రాయాలి."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? ఈ జవాబు చూచుకున్న మామగారు ఏమనుకుంటాడు? 'మా అల్లుడికి మొగమాటం ఎక్కువ; చదువులో శ్రద్ధ ఎక్కువ. ఇతనితో జాగ్రత్తగా మెలగాలి లేకపోతే మన పునాదికి మొప్పం...' ఇల్లాటి అభిప్రాయాలు కలుగుతాయి."

"కలుగుతే మనకేం లాభం?"

"తిరిగి నీకు జవాబు రాస్తాడు - తప్పక రావాలని. చూశావూ ఆ జవాబులో అతి దీనంగా నిన్ను రమ్మని ప్రార్థిస్తాడు. ఆ వుత్తరాన్ని నువ్వు ఒకటికి రెండుసార్లు చదువుతావు. అంత మజాగా వుంటుందన్నమాట-"

"ఉహు! మరయితే నేనిప్పుడేం చెయ్యాలి?'

"ఏదో తప్పనిసరిగా మామగారి మాట తీసెయ్యలేనట్టుగా నటిస్తూ అతి కష్టంమీద వస్తున్నట్టు వుత్తరం రాయాలి."

"రాసి.....?"

"నువ్వు మాట మాటకూ నన్ను ప్రశ్నించవోకు గ్రామఫోను ప్లేటులాగు. నన్ను చెప్పనీ-"

"మరి నాకు సందేహం వున్నచోట - నువ్వు ఫుల్‌స్టాఫ్‌లు, కామాలు ఇవ్వకపోతే ఎట్లా?"

"సరే - అనుమానం వచ్చినచోట ఆపు. ఇక విను. ప్రయాణం వారంరోజులు వున్నదనగానే, మంచి మంచి సూట్లన్నీ చాకలివాడికి వేసి, ఇస్త్రీ చేయించాలి. వీలైతే ఎక్కడినుంచన్నా బ్లేజర్ కోట్లు ఎరువు తెచ్చుకోవాలి. వుండేది రెండు రోజులైనా, ఒక చిన్న సూట్ కేసుకు నీ బట్టలన్నీ ఎక్కించాలి. నువ్వు వస్తున్నానని వ్రాసిన బండికి మాత్రం వెళ్ళక, ఆ బండి తప్పించి, ఆ తరువాత బండికి వెళ్ళాలి. ఇక్కడినుంచి బయలుదేరేప్పుడు నీకు వుండవలసిన సరంజామా యేమిటంటే - ఫస్ట్ క్లాస్ రిస్ట్‌వాచి, అంటే సెకండ్ హ్యాండుదైనా ఆకారం బాగుంటేసరి...మంచిఫౌంటెన్ పెన్నూ - జపాన్‌దయినా కక్కకుండా, డాబుసరిగా వుంటే పనికి వస్తుంది - ఒక కొత్త సబ్బు, ఫేస్ పౌడరు, అద్దము, దువ్వెన హెయిర్ ఆయిల్.... ....."

"సంసారానికి కావాల్సినదంతా నను."

"అసలు ఇవ్వెందుకంటే - అత్తవారింట్లో అన్నీ సక్రమంగా అందినా, అందకపోయినా - ఇవ్వి దగ్గర వుంటాయి. కాబట్టి, ఎల్లాగో 'గెట్ ఆన్' అవవచ్చు. వింటున్నావా?"

"ఆ. గో ఆన్."

"ఇక్కడ రైలు ఎక్కేప్పుడే, కావలసిన ఖర్చులకు పదిరూపాయలు ఎక్కువ వుంచుకోవాలి. ఆ పది రూపాయిలు చిల్లరమార్చి, జేబులో వేసుకొని, అత్తవారింట్లో అప్పుడప్పుడు అందరూ వినేలాగు, గలగల లాడిస్తూ వుండాలి. నీకు బావమరుదులు, మరదళ్ళూ వుంటే - వాళ్ళకు ఖరీదైన తిను బండారాలు, విలువైన బహుమానాలు తీసుకువెళ్ళాలి - అప్పు చేసైనా సరే! ఇక్కడ బయలుదేరేప్పుడు ఎటువంటి బట్టలు వేసుకున్నా ఇబ్బంది లేదు. కాని, ఆ స్టేషన్‌లో దిగంగానే మాత్రం, నువ్వు ఎరువు తెచ్చిన సూటును, బ్లేజర్ కోటు సహితంగా దబాయించాలి. మరి నీ రిస్ట్‌వాచ్ నలుగురికీ కనబడే లాగు వుంచవద్దూ? అందుకని ఫ్యాషన్ బాగా తెలిసినవాడిలాగు - కోటును ఒక చేతికే తగిలించుకుంటే, రిస్ట్ వాచ్ కనబడేందుక్కూడా అవకాశం వుంటుంది. ఇక అత్తవారింట్లో, ప్రత్యేకం నీ రిస్ట్ వాచ్ కనబడే లాగు - అప్పు డప్పుడు 'టైం' చూస్తుండాలి. స్టేషన్ నుంచి, అత్తవారిల్లు ఎంత దగ్గరయినా సరే - జట్కాలోనే వెళ్ళాలి. వెళ్ళంగానే కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు ఇస్తారు. నీ బూటూ అవీ విప్పి కాళ్ళు కడుక్కొని ఠీవిగా కుర్చీలో కూర్చో. "ఈ బండికి వచ్చారేం?" అని అడుగుతే - నువ్వు వస్తానన్నబండి తప్పి పోయిందనీ - యీ బండికి జనం ఎక్కువగా వుండటంవల్ల, ఇంటర్ క్లాసులో వచ్చాననీ - నువ్వసలు థర్డ్‌క్లాసులో వచ్చినా సరే - చెప్పు. నువ్వు తీసుకువెళ్ళిన తిను బండారాల్నీ బహుమానాల్నీ - నీ బావమరుదులకూ, మరదళ్ళకూ ఇవ్వాలి. మరిచి పొయ్యేను. కొన్ని పూలు, దవనం, ఇత్యాది - నీ భార్యకు తీసుకు వెళ్ళాలి. కాని భార్యకనిచెప్తే పరువు పోతుంది. దానికి ఒక తిరుగుడు వుంది. ఏమిటంటే - ఎవడో స్నేహితుడు మద్రాసునుంచివస్తూ, రైలులో కనబడి వద్దన్నకొద్దీ ఆ సరుకును నీ పెట్టెలో కుక్కాడని చెప్పాలి. తీసుకువెళ్ళే ప్రతి వస్తువూ చౌకబారుదైనా ఉరుము జాస్తిగా వుండాలి. ఇంక నిన్ను కుశల ప్రశ్నలు - అవీ వేస్తారు. చాలా సీరియస్‌గా వుండి వాళ్ళు పది అడిగితే - నువ్వు ఒక్కదానికే సమాధానం ఇవ్వాలి. ఆ సమాధానాలయినా నోటితో చెప్పకుండా తలవూపుతూ యాక్షన్ చేస్తూ వుండాలి. అసలు నీకు ఒక గది ప్రత్యేకంగా ఇస్తారు. ఆ గదిలోకి జేరి, ఎప్పుడూ ఏదో రాసుకుంటూ వున్నట్లుగా - ఏ రామకోటయినా ఫరవాలేదు- లేక ఏదో చదువుతూ వున్నట్లుగా - ఏ రైల్వేనవలైనా ఇబ్బంది లేదు - నటించాలి. అసలు చదివినా చదవకపోయినా సరే - చూసినవాళ్ళకు సీరియస్ స్టడీస్‌లో వున్నట్లు నటించాలి. నీ బావమరుదులు, భార్య, మరదళ్ళూ, ఒక వైపునుంచి నిన్ను 'వాచ్' చేస్తూనే వుంటారు. వాళ్ళకు ఏమాత్రమన్నా సందు ఇచ్చావా - నిన్ను గోలచేసి చెవులకు తాటాకులు కట్టేస్తారు. భోజనానికి

లెమ్మని, ఫలహారాలకు రమ్మనీ పిలుస్తే - నాలుగయిదుసార్లు పిలిచేదాకా యథాస్థానంనుంచి కదలకూడదు. భోజనం దగ్గర, ఫలహారాలదగ్గర మొగమాటం జాస్తిగా చూపాలి. నీకు చాలా ఇష్టమయిన పదార్థమయినా సరే - అధమంగా సగమన్నా వదిలెయ్యాలి. వడ్డిస్తుంటే అక్కర్లేదని రెండు చేతులు విస్తరికి అడ్డం పెట్టాలి."

"ఫుల్‌స్టాప్. మరి ఆకలిగా వుంటే ఎట్లా?"

"ఈ మాత్రం గ్రహించుకోలేవూ? ఏదో పనివున్నదని వంకపెట్టి - బజారుకెళ్ళి ఏ అయ్యర్ కాఫీ హోటల్లోనో బాయిలర్ నిండేట్టు తొక్కాలి. నీకు భార్యను చూడాలని కుతూహలంగా వుంటుంది. అది ప్రతివాళ్ళకూ వుంటుందిలే! జాగ్రత్తగా - మెలకువతో తలుపు కంతల్లోనుంచీ, గది కిటికీ లోంచీ - దొంగతనంగా చూడాలి. తెలిసిందా? ఏమాత్రం పరాకుగావున్నా, ఏ తలుపు కంతలోంచన్నా చూస్తూవుంటే బావమరిది చిలిపివాడయితే, పూచిక పుల్లతో పొడిచాడంటే - కలియుగ శుక్రాచారివి కాగలవు-"

"హోల్డాన్. ఇది చాలా కష్టమే!"

"పోనీ ఇది వదులుకో!"

"ఇంకా ఎంత వుంది బాబూ?"

"దగ్గరకు వచ్చాం. చివరి అంకం. పూటకు ఒకటి చొప్పునన్నా నీ డ్రస్సులు 'ఛేంజ్' చేస్తూ వుండాలి. - అంటే, నీ కున్న గుడ్డలన్నీ వాళ్ళకు 'ఎగ్జిబిట్' చెయ్యాలన్నమాట- పూట పూటకూ వెళ్తానంటూవుండాలి. పెట్టెసర్దాలి. బయట ఖాళీగాపోతూవున్న జట్కాను పిలవాలి. వాళ్లు 'ఇప్పుడు కాదు, సాయింత్రం' అంటూ వుంటారు. రెండుమూడుసార్లు బెట్టుచేసి తగ్గాలి. ఆ తరువాత, తప్పదంటే తప్పదని పట్టుపట్టాలి. వాళ్లుకూడా కాదు కూడదని పట్టుపడితే - నువ్వు రుస రుసలాడుతూ నీ కోపాన్నంతా ముఖంలో కనపర్చాలి. చివరకు వాళ్ళే ఒప్పుకుంటారు. అప్పుడు నీకు బట్టలు పెడతారు. నువ్వు నేను చెప్పినట్టు పైవిధంగా నటిస్తే - మంచి సిల్కులు దక్కుతాయి. లేకుంటే, మామూలు సైనుగుడ్డలే గతి! ఇందులో మరో కిటుకుకూడా వుంది. వాళ్ళు నాలుగయిదు రకాలు తెప్పించి, నిన్ను ఏరుకోమంటే - ఖరీదులు అడిగి - ఎక్కువ ఖరీదుది - నీకు నచ్చకపోయినా సరే - కోరాలి. ఒక వేళ, 'డబ్బు కావాలా? బట్టలు కావాలా? అంటే - - డబ్బనేవ్ కొంపతీసి. ఏలనన -- డబ్బయితే పది రూపాయలతో సరిపెడతారు. బట్టలయితే ఏ నలభై రూపాయలకో గుద్దెయ్యవచ్చు. ఇంక నువ్వు ప్రయాణమై వెళ్తూ వున్నప్పుడు మామగారూ, అత్తగారూ ప్రభృతులు వాకిలి వద్ద నుంచుంటారు. ఇక్కడ నీ రైలుఖర్చులు గిట్టుబాటయ్యే బేరం చూడాలి. దానికి ఏం చెయ్యాలంటే - జేబులో చెయ్యి పెట్టుకొని వేలు కొరుక్కోవాలి. 'అదేమ'ని మామగారు అడుగుతారు. నువ్వు చేతిని జేబులోనేవుంచి, 'వందరూపాయిల నోటు వున్నది. స్టేషన్‌లో చిల్లర దొరుకుతుందా? లేకపోతే ఎక్కడనుంచన్నా తెప్పిస్తారా?'

అనాలి. మామగారు నీకన్న నాలుగాకులు ఎక్కువ చదివి వుంటే - - 'ఇట్లా ఇవ్వండి' అంటాడు. నిజంగా నీ దగ్గర వుండదుగా!"

"అవును. ఇక్కడ యీ పీకులాట బేరాలతో పరువు పోదూ?"

"పరువు పొయ్యేపని చేస్తామా? విను - - ఇప్పుడు మరో జేబులో చెయ్యిపెట్టి, 'ఆఁ జ్ఞాపకం వచ్చింది - అయిదు రూపాయల నోటు వున్నది లెండి' అనాలి. మామగారు అమాయకు డయితే - - చిల్లర ఇవ్వటం బాగుండదని పది రూపాయిల కరెన్సీ ఇస్తాడు. నీ రైలు చార్జీ రెండు రూపాయిలయినా - ఇంతెందు కనేవ్! మాట్లాడ కుండా మడిచి జేబులో పెట్టుకొని, "ఇంటికి వెళ్ళంగానే పంపిస్తాలెండి" అనాలి. "ఎందుకులెండి, వుంచుకోండి" అని మామగారంటారు. నువ్వు గప్ చిప్ - సాంబార్ బుడ్డి చంకలు ఎగరేసుకుంటూ, జట్కాలోపడి "వెళ్ళివస్తానండీ! అంటూ - తోక ముడవాలి. అర్థమయిందా నేను చెప్పింది?"

"ఆఁ! కాని ఒక ప్రశ్న, ఇది స్వానుభవం మీద చెప్పిన సలహాయేనా?" అని అడిగాను.

"పోరా, ఫూల్" అని నవ్వాడు మా ప్రభాకరం!

– *ఏప్రిల్, 1940*